సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 22 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 269 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/22.9°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ(ఏ)లో ఇండస్ట్రియల్ కోటా కింద పార్ట్‌టైం, ఫుల్‌టైం పీహెచ్‌డీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య కిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో పనిచేసే వారు, ఆర్‌అండ్‌డీ సంస్థల్లో పనిచేసే సైంటిస్టులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో ఉండే ప్రజాసేవకులు అర్హులని పేర్కొన్నారు. మాస్టర్ డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏ సాధించి ఉండాలని తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణితం, మేనేజ్‌మెంట్, ఫార్మా, ఆంగ్లం, ఫుడ్ టెక్నాలజీ విభాగాల్లో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలలే కాకుండా గుర్తించిన 12 రీసెర్చ్ సెంటర్లలోనూ పీహెచ్‌డీ చేయొచ్చని తెలిపారు. రూ.5 వేల డీడీ, సంబంధిత సర్టిఫికెట్లు జత చేసి దరఖాస్తులను సెప్టెంబర్ 4లోగా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకు చేర్చాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

29 మండలాల్లో వర్షం



పుట్టపర్తిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: ఉపరితల అవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 29 మండలాల పరిధిలో 13.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా రామగిరి మండలంలో 44.6 మి.మీ వర్షం కురిసింది. ఇక రొళ్ల 41.2 మి.మీ, కనగానపల్లి 40.2, పెనుకొండ 31.4, సోమందేపల్లి 30.2, గోరంట్ల 28.0, అమడగూరు 26.2, అగళి 24.8, నల్లమాడ 22.4, పుట్టపర్తి 18.6, చిలమత్తూరు 15.4, ధర్మవరం 11.4, బుక్కపట్నం 11.2, కదిరి 10.2, సీకేపల్లి 9.4, నల్లచెరువు 8.4, ఓడీ చెరువు 8.2, బత్తలపల్లి 7.2, తనకల్లు 6.8, కొత్తచెరువు 6.2, రొద్దం 6, తాడిమర్రి 5.8, అమరాపురం 4.8, లేపాక్షి 4.6, గుడిబండ 4.4, పరిగి 3.0, ముదిగుబ్బ 2.6, హిందూపురం 2.4, మడకశిర మండలంలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

అనంతపురం డీఎస్పీ బదిలీ

అనంతపురం సెంట్రల్: అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డిని 14వ బెటాలియన్‌కు, కదిరి డీఎస్పీ శ్రీలతను తిరుపతి మహిళా పీఎస్‌కు బదిలీ చేసింది.

పోలీసు స్టేషన్‌లో దొంగలు పడ్డారు!

నల్లమాడ: దొంగలు పోలీసులకే సవాల్ విసిరారు. ఏకంగా సర్కిల్ కార్యాలయంలోనే చేతివాటం చూపారు. వివరాల్లోకి వెళితే... నల్లమాడ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. కార్యాలయంలో కంప్యూటర్ సామగ్రిని ఎత్తుకెళ్లారు. సర్కిల్ కార్యాలయానికి రాకపోకలు సాగించేందుకు ఉత్తరం, దక్షిణం రెండు వైపులా తలుపులుండగా, మంగళవారం రాత్రి దుండుగులు ఓ తలుపు నుంచి ప్రవేశించినట్లు తెలుస్తోంది. దీనిపై సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను వివరణ కోరగా... కంప్యూటర్ మానిటర్‌ను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు సమీపంలోని రామస్వామి గుడి వెనుక పడేశారని, తాము గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జెండా పండుగ నిధులేవీ?

''పంచాయతీల్లో సర్పంచ్‌లు సగౌరవంగా జెండా వందనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణ కోసం చిన్న పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు చొప్పున నిధులు ఇస్తున్నాం. ఇందుకు జీఓ కూడా విడుదల చేశాం. సర్పంచ్‌లు ఆ డబ్బుతో వేడుకలు ఘనంగా నిర్వహించాలి. పాఠశాలల్లో డిబేట్‌లు, క్విజ్‌లు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలి. స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగంలో పని చేసిన వారు, పారిశుధ్య కార్మికులను సన్మానించాలి. అలాగే పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టాలి''

– ఈ నెల 10న ఉప ముఖ్యమంత్రి హోదాలో మీడియా ముందు పవన్ కల్యాణ్ చెప్పిన మాటలివి.

''డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ చేశామని చెప్పారు. అయితే రూపాయి కూడా విడుదల కాలేదు. జనరల్ ఫండ్‌లో నిధులుంటే వాడుకోవాలని ఉన్నతాధికారులు ఉచిత సలహా ఇచ్చారు. కానీ సర్పంచ్‌లు మాత్రం ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు ఏం చేశారంటూ నిలదీస్తున్నారు.''

– ధర్మవరం మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి ఆవేదన ఇది.



డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ జెండా పండుగకు నిధులు ఇస్తున్నట్లు చేసిన ఆర్భాటపు ప్రకటన అమలు మాత్రం కాలేదు. మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు ఇస్తున్నట్లు పవన్ ప్రకటించినా రూపాయి కూడా విడుదల కాలేదు. జనం మాత్రం ప్రభుత్వం డబ్బులు ఇచ్చినా వేడుకలు ఇలాగా చేసేది అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించగా.. అవన్నీ ఉత్తుత్తి ప్రకటనలేనంటూ చెప్పేందుకు వారు నానా తంటాలు పడ్డారు.

ఆర్భాటం జాస్తి.. నిధులు నాస్తి

- పంచాయతీలకు నిధులంటూ డిప్యూటీ సీఎం పవన్ ప్రకటన
- డబ్బు మంజూరు చేయని చంద్రబాబు సర్కార్
- నిధుల జీఓకు స్వాతంత్ర్యం రాలేదా? అంటూ సర్పంచుల ఎద్దేవా
- జనరల్ ఫండ్ నుంచి వాడుకోవాలని అధికారుల ఉచిత సలహా

కదిరి: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కల్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అన్ని పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా 5 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10 వేలు, అలాగే 5 వేలకుపైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 వేల చొప్పున విడుదల చేస్తూ జీఓ జారీ చేస్తున్నామని ప్రకటించారు. దీంతో సర్పంచ్‌లు సంబర పడ్డారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఏ ఒక్క పంచాయతీకి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల కాలేదు. కానీ పవన్ ప్రకటన చూసిన వారంతా ఆ నిధులు సర్పంచ్‌లు, టీచర్లు కలిసి పంచుకున్నారంటూ ఆరోపణలు గుప్పించారు.

జిల్లాకు రూ.49.10 లక్షలు మంజూరు కావాల్సి ఉన్నా...

జిల్లాలో 16 మేజర్ పంచాయతీలు, 451 మైనర్ పంచాయతీలున్నాయి. పవన్ కల్యాణ్ ప్రకటన మేరకు మేజర్ పంచాయతీలకు రూ. 25 వేల చొప్పున రూ. 4 లక్షలు, మైనర్ పంచాయతీలకు రూ. 10 వేల చొప్పున రూ. 45.10 లక్షలు కలిసి మొత్తంగా 467 పంచాయతీలకు రూ.49.10 లక్షలు విడుదల కావాల్సి ఉంది. దీనిపై ఏ సర్పంచ్‌ను కదిపినా నిధుల జీఓకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదేమో..అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

జిల్లాలో పంచాయతీల వివరాలు:	
జిల్లాలోని మైనర్ పంచాయతీలు	451
మేజర్ పంచాయతీలు	16
మొత్తం పంచాయతీలు	467
పవన్ ప్రకటన మేరకు విడుదల కావాల్సిన నిధులు	రూ.49.10 లక్షలు

మరికొన్ని చోట్ల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పవన్ కల్యాణ్ మాటలు నమ్మి అప్పులు చేసి మరీ వేడుకలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం జీఓనే ఇవ్వలేదని తెలిసి తలలుపట్టుకుంటున్నారు.

పవన్‌ను అవమానించేందుకేనా?

కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అవమానించేందుకు టీడీపీలోని కొందరు పెద్దలు ప్రయత్నిస్తున్నారని జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. అందుకే పవన్ ఏం చెప్పినా...ఆ పని కాకుండా మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. అందుకే పవన్ మాటలకు విలువ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు పోలవరం సందర్శనకు వెళ్లినప్పుడు గానీ, ఆ తర్వాత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయినప్పుడు గానీ పవన్ కల్యాణ్‌ను పిలవక పోవడం పలు అనుమానాలకు దారితీస్తోందంటున్నారు. ఇక స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి పంచాయతీలకు నిధులు ఇస్తున్నామని పవన్ కల్యాణ్ మీడియా ముందు ప్రకటించిన తర్వాత కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం చూస్తే తమ అనుమానానికి మరింత బలం చేకూరుస్తోందని జనసేన నేతలు సందేహం వెలిబుచ్చారు.

పవన్ మాటకు విలువ లేదు



పంద్రాగస్టు వేడుకలకు నిధులు మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పిన మాటలన్నీ ఉత్తుత్తివే. జిల్లాలోని ఏ ఒక్క పంచాయతీకి నిధులు అందలేదు. దీనిపై అధికారులు ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

– చలపతి నాయక్, సర్పంచ్, పట్నం, కదిరి మండలం

జీఓ రాలేదు



పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం నుంచి ఎలాంటి జీఓ విడుదల కాలేదు. చిన్న పంచాయతీలకు గతంలో రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇచ్చేవారు. దాన్ని రూ.100 నుంచి రూ.10 వేలకు, అలాగే మేజర్ పంచాయతీలకిచ్చే రూ.250 మొత్తాన్ని రూ.25 వేలకు పెంచుతూ ప్రకటన జారీ చేశారంతే. అధికారికంగా ఎలాంటి జీఓ విడుదల కాలేదు.

– విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

అసైన్డ్ భూములను రీవెరిఫికేషన్ చేయండి

- రెవెన్యూ సిబ్బందికి జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

బత్తలపల్లి: గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు పొందిన రైతన్నల భూములను మరోసారి పరిశీలించి పూర్తి నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అందువల్ల రిజిస్టర్ అయిన అసైన్డ్ భూములను మరోసారి పరిశీలించడంతో పాటు యాజమాన్య హక్కులు పొందిన వారి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. డీఫారం పట్టా ఎవరి పేరున ఉంది... ఎవరి పేరుతో మార్పు జరిగింది... తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో భూ సర్వే తహసీల్దార్ సునీత, సీఎస్ డీటీ శారద, మండల సర్వేయర్ జోసఫ్, పలువురు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరైజేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 3వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆయా సంఘాల సీఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కంప్యూటరైజేషన్ అవసరమైన పరికరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పీఏసీఎస్‌లలో 1,93,633 మంది రైతులు సభ్యులుగా ఉండగా, వారి సభ్యత్వం, రుణాలు, డిపాజిట్లు తదితరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు విధులు అప్పగించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కంప్యూటరైజేషన్‌లో రాష్ట్రంలో మన జిల్లా 11వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్, డీఏఓ సుబ్బారావు, బ్యాంక్ సీఈఓ సురేఖవాణి పాల్గొన్నారు.

అర్హులకు విరివిగా రుణాలివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్



సమీక్షలో పాల్గొన్న జిల్లా స్థాయి అధికారులు

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: అర్హులకు విరివిగా రుణాలిచ్చి కేటాయించిన లక్ష్యాలను విధిగా చేరుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 2024–25 జూన్ త్రైమాసికానికి సంబంధించి బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులందరికీ రుణాలు అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. సోమందేపల్లి, అగళి ప్రాంతాల్లో జాతీయ బ్యాంకుల శాఖల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇన్వర్టర్ల ఏర్పాటుకు 'రూడ్‌సెట్' ద్వారా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంకు సూచించారు. 'స్టాండప్ ఇండియా' పథకం కింద 4 బ్యాంకులు మాత్రమే రుణాలు మంజూరు చేశాయని, మిగతా బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా వాసులకు రూ.17,260 కోట్లు

జిల్లా పరిధిలోని వివిధ బ్యాంకుల శాఖల్లో రూ.10,183 కోట్లు డిపాజిట్లు ఉండగా, రూ.17,260 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు ఎల్‌డీఎం రమణకుమార్ వెల్లడించారు. అందులో చిన్న, సన్న కారు రైతులకు రూ.7,479 కోట్లు, ఎస్సీలకు రూ.521 కోట్లు, ఎస్టీలకు రూ.259 కోట్ల మేర రుణాలు ఇచ్చామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,18,710 కోట్ల రుణ లక్ష్యం విధించగా, ఇప్పటికే రూ.5,099 కోట్ల మేర రుణాలిచ్చి 43 శాతం ప్రగతి సాధించినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, పశు సంవర్థక శాఖ అధికారి శుభదాస్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, నాబార్డు డీడీఎం అనురాధ, ఏపీజీబీ ఆర్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల పాటు గాలికుంటు టీకాలు

గాలికుంటు వ్యాధి నుంచి పశువులను రక్షించేందుకు నెల రోజుల పాటు జిల్లాలోని 3,39,100 పశువులకు టీకాలు వేయనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం పోస్టర్లను జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శుభదాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సెప్టెంబర్ 18వ తేదీ వరకూ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నాలుగు నెలల వయస్సు పైబడిన ఆవులు, గేదెలు, పశువులకు టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు సత్యప్రకాష్, చైతన్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23వ తేదీన జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ఆయా సభల్లో మండల ప్రత్యేకాధికారులు పాల్గొనాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ సభల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక వసతుల కల్పన, ప్రతి కుటుంబానికీ వంద రోజుల ఉపాధి కల్పించడం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పరిశీలన, వసతి గృహాల సందర్శన, తాగునీటి పైపులైన్లకు మరమ్మతు తదితర పనులను చేపట్టాలన్నారు. ఆయా మండలాల ఈఓపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు ఈ పనులన్నీ సమీక్షించాలన్నారు. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లను పరిశీలించి నోటీసులు జారీ చేయాలన్నారు. అలాంటి లేఅవుట్ల గురించి రిజిస్ట్రేషన్ శాఖకు తెలిపి క్రయ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దు

- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



పి నరసాపురంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి/సోమందేపల్లి: ''టీడీపీ నేతల దాడులు, అక్రమ కేసుల బనాయింపులపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదు. పార్టీ అండగా ఉంటుంది. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా సహించబోం. ప్రజా సమస్యలపై అందరం కలిసి కూటమి సర్కార్‌ను నిలదీద్దాం'' అని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె పరిగి మండలంలోని శిరేకోళం, పి నరసాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అనంతరం సోమందేపల్లి మండలం మేకలపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్‌పై ప్రజాగ్రహం పెల్లుబుకుతోందన్నారు. జగన్ సర్కార్ అమలు చేసిన సంక్షేమ పథకాల నిలిపివేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజా క్షేత్రంలో పోరాటానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

అతిసారం.. ఆందోళనకరం

- ఎం.రాయాపురంలో కొత్తగా మరో పది మందికి అస్వస్థత
- వైద్య శిబిరం ఏర్పాటు చేసినా అదుపులోకి రాని అతిసారం
- ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 35 మంది బాధితులు
- గుడిబండ మండలం కొంకల్లులోనూ ఆరు కేసులు



పాఠశాలలో విశ్రాంతి తీసుకుంటున్న విద్యార్థిని కీర్తనను పరామర్శిస్తున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి



అతిసారం సోకి వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న ప్యారిమ షేక్

రొళ్ల: అతిసారం ఆందోళనకరంగా మారుతోంది. వాంతులు, విరేచనాలతో జనం రాలిపోతున్నారు. అతిసారం బారిన పడిన వారిలో ఇద్దరు కోలుకొనే లోపే...మరో ముగ్గురు అతిసారంతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఫలితంగా యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. తాగునీటి పైప్ లైన్ల లీకేజీతో అతిసారం ప్రబలుతుండగా.... అధికార యంత్రాంగం వైద్యశిబిరాలతో సరిపెడుతోంది.

కొత్తగా పది కేసులు..

2,500 మందికిపైగా జనాభా ఉన్న ఎం.రాయాపురంలో శ్రీరామరెడ్డి రక్షిత మంచినీటి పథకం పైపులైన్ లీకేజీ కావడంతో అతిసారం ప్రబలింది. ఆరు రోజుల వ్యవధిలోనే 38 మంది అతిసారం బారిన పడ్డారు. వారిలో రత్నప్ప (63) పార్వతమ్మ (55) హనుమంతరాయప్ప (75) మృతి చెందారు. మిగిలిన 35 మంది ఆస్పత్రుల్లో చేరి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. తాజాగా గ్రామానికి చెందిన విద్యార్థులు కీర్తన, రక్షణ, దీక్షిత్, అమూల్యతో పాటు నవీన్, రాధమ్మ, చంద్రమ్మ, పరమేష్, సన్నప్ప, ప్యారిమ షేక్ అతిసారంతో అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఐదు రోజులుగా వైద్య శిబిరం కొనసాగుతున్నా...అతిసారం కేసులు అదుపులోకి రాలేదు. కాగా, అతిసారంతో అస్వస్థతకు గురై పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి కీర్తనను పెనుకొండ డిప్యూటీ డీఈఓ రంగస్వామి పరామర్శించారు. అలాగే కర్ణాటక రాష్ట్రం మధుగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమూల్య, తుమకూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దీక్షిత్ ఆరోగ్య పరిస్థితి ఆరా తీశారు.

ఇన్‌చార్జ్ ఆర్డీఓ పర్యటన..

ఎం.రాయాపురం గ్రామాన్ని పెనుకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓ వెంకటశివారెడ్డి సందర్శించి అతిసారంతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఆజాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, పీహెచ్‌ఎన్ సుధారాణి పర్యవేక్షిస్తున్నారు.

కొంకల్లులో ఆరు కేసులు..

గుడిబండ మండలం కొంకల్లులోనూ ప్రస్తుతం ఆరు అతిసారం కేసులు యాక్టివ్‌లో ఉన్నాయి. ఇప్పటికే గ్రామానికి చెందిన ఏడుగురు అతిసారంతో మృతి చెందగా, మరికొందరు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చికిత్సలు పొందుతున్నారు.

విద్యార్థులకు పరుగు పోటీలు



విజేతలతో నిర్వాహకులు

పుట్టపర్తి: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులకు బుధవారం పరుగు పోటీలు నిర్వహించారు. ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ మీనాక్షి హాజరై, పోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 265 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎంఈఓలు జయచంద్ర, జాన్ రెడ్డప్ప, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు లక్ష్మీనారాయణ, బాబు మురళి, నగేష్, చాంద్‌బాషా, కిష్టప్ప, మహేంద్ర్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటరమణ, ఆయా మండలాల పీడీలు పాల్గొన్నారు.

చదువుకుంటే ఉపకారం

- ప్రతిభావంతుల కోసం అన్వేషణ ప్రారంభం
- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు నోటిఫికేషన్ జారీ
- దరఖాస్తుకు సెప్టెంబర్ 6 వరకూ గడువు
- డిసెంబర్ 8న రాత పరీక్ష
- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న వారు అర్హులు
- ఒక్కసారి అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకూ ఏటా రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం



కదిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందు కోసం ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ కాగా, దరఖాస్తుకు సెప్టెంబర్ 6వ తేదీ వరకూ గడువు ఉంది. ప్రభుత్వ పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న బాల, బాలికలు అర్హులు. పోటీ పరీక్షలో ఒక్కసారి అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకూ ఏటా రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది.

ఏటా 4,087 మంది అర్హులు..

దేశవ్యాప్తంగా ఏటా లక్ష మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాస్తుండగా... ఇందులో ఏపీ నుంచి ఏటా 4,087 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హత సాధిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఏ జిల్లాకు ఎంత మంది అర్హులనేది నిర్ణయిస్తారు. ఒక్కసారి అర్హత సాధిస్తే నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలను స్కాలర్‌షిప్పు రూపంలో అందజేస్తారు. మొత్తం నాలుగేళ్ల పాటు ఈ ఉపకార వేతనం అందుతుంది.

దరఖాస్తుకు అర్హతలివే...

- 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధిస్తే చాలు.
- ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- విద్యార్థి తల్లిదండ్రుల కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు.
- రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- ఓసీ జనరల్, బీసీ, పీహెచ్ విద్యార్థులకు 40 శాతం అంటే 36 మార్కులు రావాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం (29 మార్కులు) వస్తే చాలు.

పరీక్ష విధానం..

మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్):
ఇందులో 90 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 90 మార్కులు కేటాయిస్తారు. తప్పిదాలకు మైనస్(నెగటివ్) మార్కులు ఉండవు.

స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్):
ఇందులోనూ 90 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 90 మార్కులు. 7వ, 8వ తరగతుల స్థాయిలో సైన్స్, సోషయల్, మ్యాథ్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగటివ్ మార్కులు ఉండవు. ఫిజిక్స్‌లో 12 మార్కులు, కెమిస్ట్రీలో 11, బయాలజీలో 12, మ్యాథ్స్‌లో 20, హిస్టరీలో 10, జియాగ్రఫీలో 10, పొలిటికల్ సైన్స్‌లో 10, ఎకనామిక్స్‌లో 5 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తు విధానం..

- రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా పాఠశాలలు సమర్పించాలి.
- సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా సెప్టెంబర్ 6వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేయించుకోవాలి.
- ప్రతి విద్యార్థికి పరీక్ష ఫీజు రూ.100. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులో 50 శాతం మినహాయింపు ఉంటుంది. ఎస్‌బీఐ చలానా రూపంలో ఫీజులు చెల్లించాలి.
- సెప్టెంబర్ 10వ తేదీలోపు ఫీజులు చెల్లించవచ్చు.
- దరఖాస్తు ఫారాలు, ధ్రువీకరణ పత్రాలను సెప్టెంబర్ 10వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలు అందజేయాలి.
- అదే నెల 15వ తేదీన డీఈఓ స్థాయిలో దరఖాస్తులను అప్రూవల్ చేసి, అర్హులైన విద్యార్థులకు డిసెంబర్ 8న పోటీ పరీక్ష నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రతిభావంత విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే మెరిట్ స్కాలర్ షిప్పు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉన్నత చదువులు అభ్యసించాలనే ఆశయం ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రమే అర్హులు.

– మీనాక్షి, డీఈఓ

దూసుకొచ్చిన మృత్యువు

- కారును ఢీకొన్న లారీ
- ముగ్గురి దుర్మరణం



లారీ ఢీ కొనడంతో కారులోనే ఇరుక్కుపోయిన భార్యాభర్తలు



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీల, వెంకటలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి రూరల్: ఎంతో ఆనందంగా ఉన్న సమయంలో చిన్నపాటి గొడవ జరగడంతో వారు అర్ధంతరంగా వెనుదిరగాల్సి వచ్చింది. ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. తాడిపత్రి మండలం వంగనూరు గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వివరాలు.. యల్లనూరు మండలం గొడ్డుమర్రికి చెందిన ప్రతాప్ రెడ్డి (24), ప్రమీల (20) దంపతులు. ఇంకా సంతానం కలగలేదు. ప్రతాప్‌రెడ్డి కారు డ్రైవర్ కాగా, పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో ప్రమీల పనిచేసేది. ప్రేమ వివాహం చేసు కున్న వీరు తాడిపత్రి మండలంలోని గద్దరగుట్టపల్లిలో కాపురముండేవారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని వేంపల్లిలో ప్రమీల సోదరుడి కుమారుడు కేశఖండన కార్య క్రమానికి భార్య, ఆమె తల్లి వెంకటలక్ష్మితో కలిసి ప్రతాప్ రెడ్డి కారులో వెళ్లాడు. వేంపల్లి వద్ద కారు రివర్స్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తికి బురద చిట్లడంతో ప్రతాప్‌రెడ్డితో గొడవకు దిగాడు. వివాదం మరింత ఎక్కువవుతుందన్న భయంతో బంధువులంతా ప్రతాప్‌రెడ్డితో పాటు భార్య ప్రమీల, అత్త వెంకటలక్ష్మిని బలవంతంగా కారులో పంపించేశారు. ఈ క్రమంలో మరో అర గంటలో గద్దరగుట్టపల్లికి చేరుతారన్న సమయంలో వంగనూరు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా లారీ ఢీకొంది. ప్రమాదంలో ప్రతాప్ రెడ్డి, భార్య ప్రమీల ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. వెంకటలక్ష్మిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో కన్నుమూశారు. కారులో ఇరుక్కుపోయిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీల మృతదేహాలను స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

టోల్ ప్లాజా ప్రారంభం

- 544ఈ జాతీయ రహదారిపై టోల్ వసూలుకు చర్యలు



రొళ్ల టోల్‌ప్లాజా

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ శివాలయం సమీపాన 544ఈ జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను ఎన్‌హెచ్ ఏఈఈ ధనలక్ష్మి, టోల్‌ప్లాజా మేనేజర్ నయాబ్‌చౌదరి బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అగళి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతం పి.బ్యాడిగెర గ్రామం నుంచి కోడికొండ చెక్‌పోస్టు వరకు రూ.502 కోట్ల వ్యయంతో దాదాపు 99 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. రొళ్ల, దేమకేతపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేశామని తెలిపారు. 544ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో కర్ణాటక రాష్ట్రం మంగళూరు పోర్టు నుంచి కృష్ణపట్నం పోర్టు వరకూ రాకపోకలకు మార్గం సుగమమైందన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటలో ఉన్న జెన్‌ప్యాక్ట్ కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్, వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1,500 ఉద్యోగాలను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) సహకారంతో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీటెక్ లేదా, 2022, 23, 24 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు https:/bit.ly/46Wzqz6 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాలకు 99888 53335లో సంప్రదించవచ్చు.

కూటమి పాలనలో ఉద్యోగుల గౌరవ మర్యాదలకు భంగం

- బాత్రూమ్‌లు శుభ్రం చేస్తుండగా ఫొటోలు తీసే పని సైతం సచివాలయ ఉద్యోగులకే
- కూటమి ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం
- విధులకు సంబంధం లేని పనులు కేటాయించకూడదంటూ అభ్యర్థన

హిందూపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ ఉద్యోగుల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లుతోందని సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగుల గౌరవ మర్యాదలను పెంపొందించేలా చేస్తామంటూ చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీని నమ్మి తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ చార్ట్‌తో సంబంధం లేని విధులు కేటాయిస్తూ వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. గుంటూరులో ఇటీవల జరిగిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమావేశాల్లో స్నాక్స్ డ్యూటీలు, విజయవాడ మున్సిపాలిటీ పరిధిలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ విధులు కేటాయించి మానసిక వేదనకు గురి చేశారన్నారు. అదనంగా ఆధార్ సేవలు, బీఎల్‌ఓ విధులు కూడా కేటాయిస్తున్నారని మండిపడ్డారు. చివరకు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి టాయిలెట్లు క్లీనింగ్ చేస్తుండగా ఫొటోలు తీసే విధులను సైతం కేటాయించి ఉద్యోగుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారన్నారు. ఇలాంటి విధులు నిర్వర్తించడం దివ్యాంగ, మహిళా ఉద్యోగులకు చాలా కష్టంగా ఉందన్నారు. జాబ్ చార్ట్‌తో సంబంధం లేని విధుల కేటాయింపు అంశాన్ని మరోసారి ఆలోచించాలని ప్రభుత్వ పెద్దలకు సూచించారు.

అనధికార లేఔట్లు వేస్తే చర్యలు తప్పవు

- హెచ్చరించిన పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో అనుమతుల్లేకుండా లే ఔట్లు వేసి అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సత్యసాయి ఎయిర్‌పోర్టు ఎదురుగా సర్వే నంబర్ 626లోని 6 ఎకరాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వెనుక బీడుపల్లి పొలం సర్వేనంబర్ 18లో 2.84 ఎకరాలు, పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద సర్వే నంబర్ 629, 630లో 5.48 ఎకరాలు, సంస్కృతీ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద సర్వే నంబర్ 35, 36, 37, 38, 39, 74, 75, 76, 77, 78లో 8 ఎకరాలు, ప్రశాంతి గ్రాం వై జంక్షన్ వద్ద సర్వే నంబర్ 656లో 2.23 ఎకరాలు, బ్రాహ్మణపల్లి రోడ్డులోని ఎర్త్ సాంగ్ విల్లా వద్ద సర్వే నంబర్ 411లో 0.6 సెంట్లు, 422, 416లో 1.20 ఎకరాలు, ఎయిర్ పోర్టు వద్ద సర్వే నంబర్ 365లో 0.80 సెంట్లు, బ్రిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా సర్వే నంబర్ 337లో 6 ఎకరాల్లో అనధికార లేఔట్లను గుర్తించారు. ఈ లే ఔట్లలో ప్లాట్ల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. భవన నిర్మాణాలకు అనుమతుల జారీ చేయకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

జెడ్పీలో బదిలీలకు రంగం సిద్ధం



అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం

- 286 మందితో జాబితా

అనంతపురం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి నిషేధాన్ని సడలించింది. ఈ నెల 31లోగా అన్ని రకాల బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 286 మంది బదిలీలకు అర్హులుగా జెడ్పీ అధికారులు ప్రకటించారు. ఎంపీడీఓలు- 06, పరిపాలనాధికారులు-15, సీనియర్ సహాయకులు- 26, జూనియర్ సహాయకులు-44, టైపిస్టులు-18, రికార్డు అసిస్టెంట్లు- 70, ల్యాబ్ అసిస్టెంట్లు-20, ఆఫీస్ సబార్డినేట్లు-84, నైట్ వాచ్‌మెన్లు- 03 మొత్తం 286 మందితో జాబితా సిద్ధం చేశారు. వీరంతా ఐదేళ్ల అంతకంటే ఎక్కువ రోజులు ఒకే చోట పని చేసిన వారు కావడం విశేషం.

ఆరుగురు ఎంపీడీఓలకు అనివార్యం

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఎంపీడీఓలకు ఈసారి బదిలీ తప్పనిసరి అయింది. వీరిలో బుక్కరాయసముద్రం-తేజోస్న, నార్పల- పి.దివాకర్, విడపనకల్లు-ఏవీ శ్రీనివాసులు, పెద్దవడగూరు-పి.కుళ్లాయిస్వామి, నల్లచెరువు-బి.శకుంతల, పెనుకొండ-ఎస్.శివశంకరప్పకు స్థానచలనం కలగనుంది. అయితే పెనుకొండ ఎంపీడీఓ ఉద్యోగ విరమణకు మరో ఆర్నెల్లు మాత్రమే గడువు ఉండడంతో ఆయన బదిలీ కాకపోవచ్చని జెడ్పీ వర్గాలు అంటున్నాయి.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సీనియారిటీ జాబితా..

బదిలీ ఉద్యోగుల జాబితాను జెడ్పీ అధికారులుచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం పంపారు. మరోవైపు బదిలీల ప్రక్రియకు పది రోజులే గడువు ఉండడంతో ఉద్యోగులు జెడ్పీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బదిలీల దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే వారితో కార్యాలయ పరిసరాలు సందడిగా మారాయి. మరికొందరు ఉద్యోగులు తాము కోరుకున్న చోటుకు బదిలీ కోసం ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సిఫార్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధుల లెటర్లు సంపాదించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధుల బంధువులమంటూ కొందరు, సన్నిహితులమని ఇంకొందరు బ్రోకర్ల అవతారమెత్తారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లను తాము ఇప్పిస్తామని చెబుతూ బేరాలు మొదలుపెట్టినట్లు ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



చికిత్స పొందుతున్న చంద్రమోహన్

ధర్మవరం రూరల్: మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రమోహన్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అంకె హరి, అంకె రామాంజనేయులు, అంకె కేశప్ప దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... పొలం గట్టు విషయంగా హరి, రామాంజనేయులు, కేశప్పతో చంద్రమోహన్‌కు వివాదం ఉంది. ఈ క్రమంలో చంద్రమోహన్ పొలాన్ని వారు ఆక్రయించి పంట సాగు చేసుకుంటున్నారు. అయినా చంద్రమోహన్ ఏనాడూ వారితో గొడవ పడింది లేదు. ఈ క్రమంలోనే పూర్తిగా అడ్డు తొలగించుకుంటే భూ వివాదం సమసిపోతుందని భావించిన వారు బుధవారం ఉదయం తన పొలం గట్టుపై వెళుతున్న చంద్రమోహన్‌ను అడ్డుకుని ఘర్షణకు దిగారు. రాడ్లు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. వారి దాడి నుంచి తప్పించుకుని పారిపోయి గ్రామానికి చేరుకోవడంతో స్థానికులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఆటో బోల్తా... కూలీ మృతి



మృతుడు నరసింహులు

గుత్తి రూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తమ్మన్నగారి నరసింహులు (37)కు భార్య కీర్తి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని టమాట మండీలో కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలతో కలసి బుధవారం ఉదయం ఆటోలో అనంతపురానికి బయలుదేరాడు. గుత్తి మండలం కొత్తపేట శివారులోకి చేరుకోగానే బైపాస్ బ్రిడ్జిపై డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేకపోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై ఎస్‌ఐ నబీరసూల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుంటలో పడి వృద్ధుడి మృతి

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పాజీపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి రామగిరి మండలం గరిమేకలపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ (60) మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మూడు రోజుల క్రితం కుంటలో పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



పోతుల నాగేపల్లిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీఏ సుబ్బారావు

ముదిగుబ్బ: మండలంలోని గరుగుతండాలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును బుధవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఏఓ లక్ష్మీనరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ-పంట నమోదు ఉపయోగాలను రైతులకు వివరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకూ పంట సాగు చేయని రైతులు వెంటనే ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ షరీఫ్, ఎంపీఈఓ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండలంలోని పోతులనాగేపల్లిలో చేపట్టిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలకు ఈ-పంట నమోదు దోహదపడుతుందన్నారు. ఇప్పటి వరకూ పంట సాగు చేపట్టని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది పూర్ణిమ, ఏడీఏ క్రిష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

గుప్తనిధి వేటగాళ్ల అరెస్ట్

రాయదుర్గం: గుప్తనిధి వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. బుధవారం రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వలీబాషాతో కలసి నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. రెండు రోజుల క్రితం బళ్లారి రోడ్డులోని కుంటుమారెమ్మ ఆలయం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రాయదుర్గం నుంచి బళ్లారి వైపు వెళుతున్న కేఏ 50పీ 7097 నంబరు గల వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఆ సమయంలో ముగ్గురు పారిపోవడంతో మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో వంట గ్యాస్, ఆక్సిజన్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు, గడ్డ పారలు, సుత్తులు, ఉలి, పూజా సామగ్రి, ఆత్మరక్షణ కోసం మారణాయుధాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద మరో ఇద్దరు పట్టుబడ్డారు. వీరిలో శింగనమల మండలం నాగలగుడ్డంకు చెందిన గంజికుంట విజయ్‌కుమార్, పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన బోయ వెంకటేశులు, చల్లా శివకుమార్, రాయదుర్గం పట్టణానికి చెందిన కంసల నబీఖాన్, షేక్ వన్నూర్‌వలి ఉన్నారు. డి.హీరేహాళ్ మండలం అశోక సిద్దాపురం సమీపంలో కొండల్లో వెలసిన పురాతన ఆలయంలో గుప్త నిధి వెలికి తీసేందుకు వెళుతున్నట్లుగా విచారణలో నిందితులు అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.